
# జీవిత పాఠం

- మొక్కపాటి శ్యామల

**చేతులు పేపరు తిరగేస్తున్నా మనసు మాత్రం పేపర్లో విషయాల మీద లగ్నం కావట్లేదు. సౌదీ వెళ్ళాలా? వద్దా? అని తీవ్రంగా ఆలోచిస్తోంది. ఈ సంఘర్షణకు కారణం ఈమధ్యనే పేపర్లో నేను చూసిన ఉద్యోగ ప్రకటన నెలకు 3 లక్షల జీతంతోపాటు ఆకర్షణీయమైన అలవెన్సులు వెరసి నా మనసు ప్రలోభపడటం, నేను ఇంటర్వ్యూకి వెళ్ళి సెలక్టవటం వరకూ చకచకా జరిగాయి.**

నేను సెలక్టయిన మల్టీ నేషనల్ కంపెనీకి కనీసం 5 సంవత్సరాలు బాండ్ రాయాలి. అంతవరకూ కూడా బాగానే ఉంది కానీ, నా ఉద్యోగం స్థిరంగా ఒక చోట ఉండేది కాదు. నేను కుటుంబాన్ని తీసికెళితే ఇబ్బంది అవుతుంది. కుటుంబాన్ని ఇక్కడే ఉంచి నేను వెళ్ళాలనేసరికి, అప్పుడు మొదలయింది నాకు ఈ సంఘర్షణ. ఎటూ తేల్చుకోలేక ముందు 20రోజులు లీవ్ పెట్టేశాను. నేను ఏదో ఒకటి తేల్చుకుని బాండ్ పేపర్లు పంపటానికి ఇంక వారమే టైముంది. నేను చివరి క్షణంలో మనసుకి ఎలా తోస్తే అలా చేద్దాంలే అనుకుని లీవ్‌ని ఎంజాయ్ చేస్తున్నాను. నా భార్య, పిల్లలు మాత్రం నేను సౌదీ వెళ్ళినట్టు, నేను పంపిన లక్షలు వాళ్ళు ఖర్చుచేస్తున్నట్లు గాలిలో తేలిపోతున్నారు.



అసలు నేను సౌదీ వెళ్ళాలి- వద్దు అని స్థిరమైన నిర్ణయానికి రాలేకపోవటానికి కారణం, త్రాసులో తూచినట్లుగా నా మనస్సు రెండు వేపులకీ సమానంగా మొగ్గుతోంది. అదే ఇప్పుడు వచ్చిపడిన పెద్ద సమస్య.

నా బావమరుదులిద్దరూ, భార్యాపిల్లలని, తల్లిదండ్రుల దగ్గర అంటే నా అత్తమామల దగ్గర ఒదిలేసి ఒకళ్ళు అండమాన్‌లోనూ, ఇంకొకళ్ళు మస్కట్‌లోనూ ఉండి లక్షలు సంపాదిస్తున్నారు. రెండుమూడు సంవత్సరాలకొకసారి వస్తూ ఉంటారు. వచ్చేటప్పుడు వాళ్ళ పిల్లలకి, ఏవేవో తెచ్చుకుంటూ, కంటి తుడుపుగా నా పిల్లలకు కూడా ఏవో తెస్తుంటారు. వాళ్ళ ఆడంబరాలన్నీ చూసి, వాళ్ళు వెళ్ళాక కొన్నాళ్ళ దాకా నా భార్యాపిల్లలు మామూలు మనుషులు కాలేరు. అంతే నా! "రాజును చూసిన కన్నులతో" అన్నట్లు చీదరింపుగా నాకేసి చూస్తుంటారు. నన్ను కొన్ని నెలల వరకు. ఇది, నేను సౌదీ వెళ్ళాలి అనుకోటానికి మొదటి ప్రేరకమైతే, ఇక రెండవది, ఆ కంపెనీ ఇస్తానన్న జీతం ఇప్పటి నా సంపాదనకి మూడు రెట్లు ఉండటం. డబ్బెవరికి చేదు? చెప్పండి.

పోనీ వెళ్ళిపోదామా అంటే, నా భార్యాపిల్లలని, తల్లిదండ్రుల దగ్గర ఒదిలేసి, వెళ్ళటానికి, నాకు అవకాశం లేదు. ఇద్దరూ పై లోకాలకి వెళ్ళిపోయారు. అన్నయ్యలు ఉన్నా ఎవరి బాధ్యతలు వాళ్ళవి. పోనీ వీళ్ళని కూడా నా అత్తమామల బాధ్యతకే వదలటం నాకు ససేమిరా ఇష్టం లేదు. నా బావమరుదుల పిల్లలని వాళ్ల అల్లరిని చూశాక, నా కుటుంబ బాధ్యతని ఎవరిమీదా ఒదిలెయ్యటానికి నా మనసు అంగీకరించట్లేదు. ఐనా నా బావమరుదుల పిల్లలు ఇంకా చదువులదాకా రాలేదు. నా పిల్లలు ఇప్పుడే ఒకళ్ళు 6, ఇంకొకళ్ళు 5 తరగతుల్లో ఉన్నారు. నేను సౌదీ వెళ్ళకూడదనుకోటానికి ఇది బలమైన కారణం. ఇక రెండవది నేను భాగ్యనగరంలో ఒక కార్పొరేట్ కాలేజ్‌లో కెమిస్ట్రీ లెక్చరర్‌ని. ఐ.టి. బూమ్ ధర్మమా అని జీతం బాగానే ఉంది. భాగ్యనగరం లాంటి చోట కూడా నేను మంచి ఇల్లు, కారు సమకూర్చుకుని మధ్యతరగతికన్నా ఒక మెట్టుపైనే జీవిస్తున్నాను. నా పిల్లలిద్దరూ మంచి స్కూల్లో, చదువుతున్నారు. ఇలాంటి జీవితాన్ని కాలదన్నుకుని కేవలం డబ్బుకోసం పరిగెత్తటం, అదే ఈ తరుణంలో విజ్ఞతకాదేమో అనిపిస్తోంది. ఈ అవకాశాన్ని జారవిడుచుకుంటే, ఇప్పటికే వయసుదాటి పోతోంది. ఇంక తరవాత అస్సలు వెళ్ళలేనేమో అనిపిస్తోంది. ఇలాంటి సంఘర్షణ నేపథ్యంలోనే, పేపరు తిరగేస్తున్న నా కళ్ళు ఒక ప్రకటన దగ్గర ఆగిపోయాయి.

పాఠశాల కట్టి 75 సం.లు పూర్తయిన సందర్భంగా చేస్తున్న ఉత్సవాలలో పూర్వ విద్యార్థులు- ఉపాధ్యాయులు ఎక్కడున్నా రావలసిందిగా ఆహ్వానిస్తూ చేసిన ప్రకటన అది. గబగబా ఊరి పేరు చూశాను. నా మనసు ఆనందంతో గంతులేసింది అది నేను చదువుకున్న "చింతలపూడి" హైస్కూలే. హైస్కూల్ తరవాత, జీవితం బాధలు- కష్టాలతో రకరకాల మలుపులు తిరిగిందేమో, పి.హెచ్‌డి. చేసినా, హైస్కూల్ జీవితమే స్వర్ణయుగంలా నా మనసులో గుర్తుండిపోయింది. అక్కడికి దగ్గరలో ఉన్న పల్లెటూరే మా సొంత ఊరు. ఉండటానికి 10 కి.మీ. దూరంలోనే ఉండేది కానీ, ప్రయాణ సౌకర్యం బొత్తిగా లేని ఆ రోజులలో మా ఊరి పిల్లలకి చింతలపూడి అంటే పెద్ద దూర ప్రయాణమే. అక్కడే ఉండి చదువుకోటమంటే, దేశాంతరమో, ఖండాంతరమో వెళ్ళిపోయినట్లే. నాకు బాగా క్లోజ్ ఫ్రెండ్స్ నలుగురుండేవాళ్ళు. మేము ఐదుగురం ఒక గ్రూపు. నాకన్నా వాళ్ళు నలుగురూ కొంచెం పెద్దగా ఉండటంచేతో ఏమో! వాళ్ళు నన్ను ఒక చిన్న పిల్లాడిలా చూసేవాళ్ళు. కానీ, బాగా చదువుతానని, పరీక్షలలో మాత్రం నేను చెప్పినట్లే వినేవాళ్ళు. మా ఐదుగురిలో ఒకడు రామకృష్ణ మాస్టారి (ఇంగ్లీషు) కొడుకు శేఖర్. ఆచారి మాస్టారి (తెలుగు) కొడుకు ప్రసాద్. మిగిలిన వాళ్ళిద్దరి పేర్లు రవి, శశి.

హైస్కూల్ జీవితం తరువాత రకరకాల మార్పులు జరిగి, మా ఊరితో సంబంధం తెగిపోయి, నా జీవితం చివరికి విశాఖపట్నంలో స్థిరపడింది. ఈ పాతికేళ్ళలో ఆస్తి సంబంధమైన చిన్న చిన్న వ్యవహారాలలో మా ఊరు వెళ్ళటంవలన రవి, శశి ఉద్యోగాలకి ఎగబడకుండా, అక్కడే సెటిలవటం వల్ల వాళ్ళని కలుసుకోవటం జరిగింది. అలా కలిసినప్పుడు వాళ్ళు ఆచారి మాస్టారు రిటైర్ అయ్యేవరకూ, అదే ఊర్లో చేసి, ఇప్పుడు ప్రసాద్ దగ్గర విజయవాడలో ఉంటున్నారని చెప్పారు. శేఖర్ గురించి వాళ్ళకి కూడా ఏమీ తెలియదన్నారు. శేఖర్ గుర్తురాగానే, చింతలపూడి వెళ్తే ఒకసారి శేఖర్‌ని కూడా చూడచ్చేమో అని ఆశ కలిగింది. ఎలాగో లీవ్‌లోనే ఉన్నాను కదా! ఒకవేళ సౌదీ వెళ్ళిపోతే, మళ్ళీ చింతలపూడిని, హైస్కూల్ ఫ్రెండ్స్‌ని కలుసుకునే అవకాశం రాదేమో! అందుకే చింతలపూడి వెళ్ళాలని నిశ్చయించుకున్నా. చింతలపూడి, హైస్కూల్ జీవితం గుర్తుచేసుకుంటుంటే నైన్త్‌లో ఉన్నప్పటి సంఘటన గుర్తొచ్చింది. ఉన్నట్టుండి ఒకరోజున శేఖర్ మా నాన్నగారు ఈ ఉద్యోగం ఒదిలేసి రంగూన్ వెళ్ళిపోతారుట. ఈ ఉద్యోగంలో ఎన్నాళ్ళు ఉన్నా ఎదుగూ బొదుగూ ఉండదట. మా చుట్టాలు అక్కడ పెద్ద పెద్ద కాంట్రాక్టర్లు ఉన్నారట మా నాన్నగారు అక్కడికే వెళ్ళిపోతారట అన్నాడు కళ్ళు పెద్దవి చేసి, చేతులు తిప్పుకుంటూ నువ్వు ఇక్కడ చదువుకోవా?

అన్నాను నేను దిగాలుగా మొహంపెట్టి ఎందుకో మిగిలిన ముగ్గురికన్నా నన్ను శేఖర్ ప్రేమగా చూసేవాడు. మేము ఇక్కడే ఉంటాంరా! మా నాన్నగారొక్కరే వెళ్ళిపోతారు అన్నాడు శేఖర్ నా భుజం తట్టి ధైర్యం చెప్తున్నట్లు. అమ్మయ్య అని నలుగురం ఊపిరి పీల్చుకున్నాం.

ఇంగ్లీషు గ్రామరు రాకపోతే కొట్టటానికి, ఎండలో నిలబెట్టటానికి రామకృష్ణ మాస్టారు ఉండరని మొదట్లో సంబరపడ్డా, చివరికి మాస్టారు వెళ్ళేనాడు శేఖర్‌తోపాటు మేముకూడా భోరున ఏడ్చేశాం. మాస్టారు వెళ్ళిన కొత్తలో శేఖర్ చాలారోజులు దిగాలుగా బెంగగా ఉండేవాడు. రానురాను శేఖర్‌లో చాలా మార్పు వచ్చింది. ఎప్పుడూ జేబులో డబ్బులుండేవి. మా అందరికీ పకోడి బండి దగ్గర చిల్లర తిళ్ళు కొనిపెట్టేవాడు. ఒకసారి పెద్దవాళ్ళకి చెప్పకుండా సినిమాకి తీసికెళ్ళాడు. తెల్లారి ఆచారి మాస్టారు మా అందరినీ కొట్టి ఎండలో నిలబెట్టారు. అప్పటినుంచి శేఖర్ మా గ్రూప్‌లోంచి విడిపోయాడు. టెన్త్‌పరీక్షలలో, ఆచారి మాస్టారు ప్రసాద్‌తోపాటు మమ్మల్ని కూడా వాళ్ళింట్లోనే ఉంచి చదివించారు. శేఖర్‌ని బతిమాలి మొదటి రోజు తీసుకొచ్చారు. మాస్టారు మాతోపాటే మెలుకువగా కూచుని మధ్యలో మాకు టీ, హార్లిక్స్ ఇచ్చేవారు. తెల్లవారుజామున మాతోపాటే లేచేవారు. కన్న తండ్రిలా అలా చేస్తుంటే శేఖర్ పాపం వాళ్ళ నాన్నగారిని గుర్తుతెచ్చుకొని ఏడ్చేశాడు. రెండోరోజునుంచీ ఎంత బతిమాలినా రాలేదు. ఫ్రెండ్స్‌తో చదువుకుంటానని, ఇంట్లోచెప్పి, మధ్యలో సినిమాకి కూడా వెళ్ళాడు. మా గ్రూప్‌లో శేఖర్ ఒక్కడే ఫెయిల్ అయినందుకు ఆచారి మాస్టారు చాలా బాధపడ్డారు. శేఖర్‌తోపాటు ఆ సంవత్సరం చాలామంది ఇంగ్లీషులో ఫెయిల్ అయ్యారు. తల్లిదండ్రులందరూ రామకృష్ణ మాస్టారిని తిట్టుకున్నారు కూడా. శేఖర్ తలుచుకుంటే ఎలా ఉన్నాడో ఒక్కసారి చూస్తే బాగుండని, కనీసం అడ్రసు తెలిసినా ఒకసారి వెళ్ళి చూడాలని అనిపిస్తోంది.

చింతలపూడిలో బస్సు దిగి, ఆటో ఎక్కి హైస్కూల్‌కి పోనీ అనగానే, ఏ హైస్కూల్? అన్నాడు వాడు. నన్ను ఏ యుగంలో ఉన్నావు? అన్నట్లుగా గవర్నమెంట్ హైస్కూల్, ఊరి చివర పెద్దమామిడి తోటలో ఉంటుంది. అంటూ నాకు తెలిసిన, గుర్తున్న ఆనవాళ్ళు అన్నీ చెప్పాను. స్కూలు, ఇదివరకటిలాగే ఉంది కానీ, గ్రౌండ్‌లో మామిడి చెట్లు కొన్ని కొట్టేసి షెడ్లు వేశారు. గవర్నమెంట్ జూనియర్ కాలేజ్- చింతలపూడి అని పెద్ద ఆర్చి కట్టారు. పూర్వం పకోడీ బండి ఉండే స్థానంలో కాంటీన్ వెలిసింది. పప్పుండలు- నారింజ బిళ్ళల అమ్మే రామయ్య తాత కూచునే చోట్లో కూల్ డ్రింక్స్, జ్యూస్ షాపు వెలిశాయి. నేను వెళ్ళిన కొంతసేపటికి ఒకాయన టాక్సీలో వచ్చి కాంటీన్‌లో కూచున్నారు. పాపం ఎవరికోసమో తెగ ఎదురుచూస్తున్నారు. ఎవరో మాస్టారే అయి ఉంటారనుకుని, నాకు తెలిసిన మొహాలకోసం పరిశీలనలో పడిపోయాను. శశి, రవి ఊర్లోనే కనుక కలిసి వచ్చేశారు. ఇంక మా లోకంలో మేము పడిపోయి ఆ వ్యక్తిని గమనించలేదు. అదిగో ప్రసాదు, ఆచారి మాస్టారు అన్నాడు రవి.

ప్రసాదు అచ్చం నేను చూసినప్పటి ఆచారి మాస్టారిలా ఉన్నాడు. మాస్టారిని చెయ్యిపట్టి నడిపించుకొస్తున్నాడు. వెనకాల 7,8 ఏళ్ళ కుర్రాడు చిన్న బాగ్ పట్టుకుని వస్తున్నాడు ప్రసాద్ కొడుకు కాబోలు.

అప్పటివరకూ కాంటీన్‌లో కూచుని ఎదురుచూస్తున్న వ్యక్తి- ఆచారీ! అంటూ వచ్చి ఆచారి మాస్టారిని కౌగలించుకున్నాడు.

ఎవరనుకున్నారు? రామకృష్ణ! మీ ఇంగ్లీషు మాస్టారు గుర్తుపట్టలేదా? అన్నారు ఆచారి మాస్టారు. మా నలుగురిని ఉద్దేశించి. అప్పటిదాకా గుర్తుపట్టనందుకు బాధపడుతూ, శేఖర్ రాలేదా మాస్టారూ?

శేఖర్ ఇప్పుడెక్కడుంటున్నాడు? ఏం చేస్తున్నాడు? అంటూ ప్రశ్నలలో ముంచెత్తాం!

శేఖర్ హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తున్నాడని, బాగానే సంపాదిస్తున్నాడని తెలుసుకుని అందరం సంతోషించాం.

వచ్చిన వాళ్ళందరూ, ఆచారి మాస్టారిని పలకరించటం, నమస్కారం చెయ్యటం! మా తెలుగు మాస్టారు అంటూ గర్వంగా పక్కనున్న భార్యకో, పిల్లలకో పరిచయం చెయ్యటం చేస్తున్నారు! ఈయన రామకృష్ణ అని, ఇంగ్లీషు మాస్టారు. ఇక్కడే పనిచేశారు అని కొందరికీ, మీ ఇంగ్లీషు మాస్టారురా! గుర్తుపట్టలేదా? అని మరికొందరికి ఆచారి మాస్టారే, రామకృష్ణ మాస్టారిని పరిచయం చేస్తున్నారు. కొందరు ఓహో! అంటే, కొందరు అదికూడా అనకుండానే వెళ్ళిపోయారు. మీ ఆశీస్సులే ఇంతవాణ్ణి చేశాయి మాస్టారూ, ఇది మీరు వేసిన పునాదే మాస్టారూ! అంటూ భక్తితో ఆచారి మాస్టారి కాళ్ళకి నమస్కారం చేస్తున్నవాళ్ళని చూస్తూ, ఎవరినైనా మిస్సవుతామేమోనని పరీక్షగా చూస్తున్నాం మేము నలుగురం.

> **ఇంగ్లీషు గ్రామరు రాకపోతే కొట్టటానికి, ఎండలో నిలబెట్టటానికి రామకృష్ణ మాస్టారు ఉండరని మొదట్లో సంబరపడ్డా, చివరికి మాస్టారు వెళ్ళేనాడు శేఖర్‌తోపాటు మేముకూడా భోరున ఏడ్చేశాం.**

అరరే! రామకృష్ణా ఏమైందయ్యా? అంటూ ఆచారి మాస్టారు కంగారు పడుతుంటే, రామకృష్ణ మాస్టారికేసి చూశాం. మాస్టారు గుండె పట్టుకుని బాధతో మెలి తిరిగిపోతున్నారు. ప్రసాద్ గబగబా మాస్టారి బాగ్‌లోనుంచే టాబ్లెట్ తీసివేశాడు. మంచినీళ్ళు పట్టాను నేను. శశి, రవి గబగబా వెళ్ళి డాక్టర్‌ని వెంటపెట్టుకొచ్చారు.

ఇంత రిస్కు తీసుకొని ఒంటరిగా ఎందుకు ప్రయాణం చేశారు మాస్టారు అన్నాడు ప్రసాద్, మాస్టారు కొంచెం తేరుకున్నాక, మాస్టారికి ఈమధ్యనే హార్ట్ ప్రాబ్లమ్ వచ్చిందని తెలిసి.

నిన్ను రమ్మంటే వచ్చావు కాదు. నేను హైదరాబాద్‌లో రెండిళ్ళు కట్టించాను. రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తున్నాను. అప్పుడు కొడుకుని విడిచి రాలేక నువ్వు రాలేదు. ఇప్పుడు నిన్ను విడవలేక నీ కొడుకు ఎక్కడికీ కదలడు. నీ గానుగెద్దు జీవితమే వాడికీ అలవాటు చేశా? అంటూ, ఆచారి మాస్టారిని వచ్చిన దగ్గరనుంచీ చనువుగా దెబ్బలాడుతూనే ఉన్నారు రామకృష్ణ మాస్టారు. రామకృష్ణ మాస్టారి మాటలు వింటుంటే నా మనసు సౌదీ వెళ్ళటానికే ఒక ఓటు అదనంగా వేస్తోంది.

ప్రసాద్ మాతో మాట్లాడుతున్నా, మధ్య మధ్యలో ఆచారి మాస్టారికి, బి.పి. మాత్ర వెయ్యటం. నాన్నా! రెండు బిస్కట్లయినా తిను. నువ్వు మళ్ళీ ఇంకొక టాబ్లెట్ వేసుకోవాలి? అంటూ పసి పిల్లాడికి చేసినట్లు చేస్తుంటే, చిన్నప్పుడు ప్రసాద్‌కి పరీక్షల్లో, ఆచారి మాస్టారు హార్లిక్స్ తాగించటం గుర్తొచ్చింది నాకు. అప్పటివరకూ గడగడా మాట్లాడుతున్న రామకృష్ణ మాస్టారు కామ్‌గా ఉంటే రామకృష్ణ మాస్టారికేసి చూశాను. మాస్టారి కళ్ళలో సన్నటి నీటి పొర మమ్మల్ని చూసిన ఆనందంలో రామకృష్ణ మాస్టారు సరదాగా మాట్లాడుతున్నా, దేనికో బాధపడుతున్నట్లుగానే అనిపిస్తోంది నాకు, వచ్చినప్పటినుంచీ, మాస్టారికి సాయంగా ఉండచ్చు, శేఖర్‌ని కూడా ఒకసారి చూడచ్చు అనుకొని హైదరాబాద్ వెళ్ళా మాస్టారితో పాటు.

బెల్‌కొట్టిన 10 నిమిషాలకి విసుక్కుంటూ వచ్చి తలుపుతీసిన మాస్టారి కోడల్ని ఎవరూ? ఇంత పొద్దున్నే! అని తూలుకుంటూ వచ్చిన శేఖర్‌ని, చూడగానే, మాస్టారు దేనికి బాధపడుతున్నారో నాకు అర్థమయింది.

ఏమిటి? మళ్ళీ ఈ ముసలాడికి గుండె నెప్పి వచ్చిందా? కొంపలో కూచోమంటే కూచోడుకదా? ఈయనెప్పుడో రంగూన్ వెళ్ళి మమ్మల్ని ఉద్ధరించాడని విరగబడిపోతుంటాడు. అయినా, ఆ స్కూల్లో నువ్వెవరిని ఉద్ధరించావని? నీ కొడుకే టెన్త్‌క్లాస్ ఫెయిల్ అయ్యాడు. మా పిల్లల ఉసురు ఉట్టినే పోతుందా? అని అందరూ మొహాన పేడనీళ్ళు కొట్టారా? అంటూ, రాత్రి తాగిన మందు ప్రభావం దిగలేదు కాబోలు. పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నాడు శేఖర్. ఇంకా ఏమి మాట్లాడేవాడో కానీ.

చింతలపూడిలో మీరందరూ కలిసి చదువుకున్నారు కదా? వాసుని గుర్తుపట్టావా? వైజాగ్‌లో ఉంటున్నాడట, నిన్ను చూడాలని వచ్చాడు. అన్నారు మాస్టారు శేఖర్ పరిస్థితి నాకు అర్థమైపోతుందని కంగారుగా.

పిల్లలు ఎదిగే టైములో డబ్బు సంపాదనే ధ్యేయంగా, పరిగెడితే జరిగే అనర్థం అవసరాలని మించిన డబ్బు, స్వేచ్ఛ కుటుంబాన్ని ఎలా గాడితప్పిస్తాయో, అర్థమై 20సంవత్సరాల తర్వాత నన్ను, నా కొడుకుని ఊహించుకుని కంపించిపోయాను.

ఇంటికి రాగానే అగ్రిమెంట్ పేపరుమీద సంతకం చెయ్యకుండా, ఆ పేపర్లు తిప్పి పంపించేశా.

చిన్నప్పుడు చదువు నేర్పిన ఆచారి మాస్టారు, రామకృష్ణ మాస్టారు, సరైన సమయంలో జీవితపాఠం కూడా నేర్పారనిపించి, మనసులోనే ఆ ఇద్దరికీ గౌరవంగా నమస్కరించుకున్నా. నా స్టూడెంట్స్ చూపే అభిమానం, క్రమశిక్షణతో పెరుగుతున్న నా కొడుకు జీవితం, ఈ రెండింటి కన్నా, విలువైనవి ఏవీ లేవు. ఉన్నా నాకు ఒద్దు అనుకుని, గుండెలమీద నుంచి పెద్ద బరువు తొలగిపోయిన హాయితో సుఖంగా నిద్రకుపక్రమించాను. ❖

రచయిత్రి చిరునామా:
**ఎం.శ్యామల**
ఇం.నెం.23-98-ఎ, గణేష్ కాలనీ, శ్రీనివాసనగర్,
సింహాచలం రోడ్, విశాఖపట్నం-27